

రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

పారిశ్రామికవేత్తల లబ్ధికే..!

- పరిశ్రమలు పెట్టే వారికే అనేక సౌకర్యాలు
- భూములు ఇచ్చిన రైతులకు తక్కువ పరిహారం
- ఇదీ ఎంఎస్ఎంఇ పార్కుల పరిస్థితి

ఓర్వకల్లు వద్ద ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టిజి.భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే గౌరుచరితారెడి, తదితరులు (ఫైల్)

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇటీవల పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఎంఎస్ఎంఈ పార్కును 167 ఎకరాల్లో ఏర్పాటు చేసి ప్రారంభించారు. మంత్రాలయం నియోజకవర్గ పరిధిలో 30 ఎకరాల్లో, కోడుమూరు నియోజకవర్గ పరిధిలో 50 ఎకరాల్లో, ఆలూరు నియోజకవర్గం పరిధిలో 10 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూములను సేకరిస్తున్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గం పరిధిలో జగదుర్తి, నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని తంగడంచ ప్రాంతాల్లో ఈ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపింది. ఈ పార్కుల్లో పారిశ్రామికవేతలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పార్కుల్లోని ఏర్పాటు చేసే ప్లాట్లను నేరుగా పారిశ్రామికవేత్తలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పారిశ్రామికవేత్తల దరఖాస్తులను ఏపీఐఐసీ పరిశీలన చేసిన అనంతరం వారికి భూములను కేటాయిస్తారు. ప్రస్తుతం నెలకొల్పుతున్న ఈ పార్కుల్లో భూమిని మొత్తం నేరుగా ఏపీఐఐసీ అభివృద్ధి చేస్తుంది. ఇందులో మౌలిక వసతులైన రోడ్లు, విద్యుత్, నీరు తదితర సౌకర్యాలను కల్పిస్తారు. ఈ భూమిని తీసుకున్నానంతరం పారిశ్రామికవేత్తలు నేరుగా బ్యాంకుల్లో భూమిని తనక పెట్టి రుణాలు కూడా పొందవచ్చు. అలాగే పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పరిశ్రమల శాఖ ద్వారా ప్రభుత్వమే వారికి బ్యాంకుల ద్వారా రుణాలను కూడా ఇప్పిస్తుంది. పారిశ్రామికవేత్తలు కేవలం భూమి కొనుగోలు సమయంలో కొంత నగదు వెచ్చించాల్సి ఉంటుంది. ఆ భూమి పారిశ్రామికవేత్తలకు బదలాయింపు అయిన తర్వాత బ్యాంకుల్లో తనాక పెట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

రైతులకు మాత్రం తక్కువ పరిహారమే

పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఓర్వకల్ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కులో ఏపీఐఏసి రైతుల నుండి తక్కువ ధరకే భూములను సేకరించింది. ఇక్కడ గుట్టపాడు, బ్రాహ్మణపల్లె గ్రామాల పరిధిలో పార్కు కోసం రైతుల నుండి ఎకరాకు రూ.ఐదు లక్షల నుండి రూ.ఏడు లక్షలు మాత్రమే పరిహారం ఇచ్చి ఏపీఐఐసీ సేకరించింది. అసైన్మెంట్ భూములను ఏళ్లుగా సాగు చేస్తున్నటువంటి రైతులకు మాత్రం ఒక పైసా కూడా పరిహారం ఇవ్వకుండా తీసుకున్నారు. కొంతమంది రాజకీయ పలుకుబడిన నేతలు ఈ భూములను తమ పేర్ల మీద పాస్ పుస్తకాలను పొంది పరిహారం పొందారు. ఎంతో విలువైన సారవంతమైనటువంటి భూములకు మాత్రం తక్కువ పరిహారంతో రైతుల నుండి సేకరించి భూములను తీసుకోవడం పట్ల కూడా ఆ ప్రాంత రైతుల నుండి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ద్వారా పారిశ్రామిక వేతలకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది. వీటి ఏర్పాటు కోసం రైతులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎంఎస్ఎంఈ పార్కులను రాష్ట్ర ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. రైతుల నుండి భూములను తక్కువ ధరకు ఏపీఐఐసీ సేకరిస్తుంది. రైతులకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల చొప్పున మాత్రమే పరిహారం అందజేస్తూ భూములను తీసుకుంటుంది. ఇదే భూములను ప్లాట్ల రూపంలో అభివృద్ధి చేసి నేరుగా ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఏపీఐఐసి చర్యలు చేపట్టింది. ఇక్కడ పరిశ్రమలు పెట్టే వారికి మాత్రం ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తుంది. ఇదీ ఎంఎస్ఎంఈ పార్కుల వ్యవహారం. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు..

రైతులకు ఒరిగిందేమీ లేదు

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఎంఎస్ఎంఈ పార్కుల పేరుతో రైతుల నుండి ఏపీఐఐసీ భూములను తీసుకుంటుంది. రైతులకు మాత్రం అతి తక్కువ పరిహారం మాత్రమే ఇస్తున్నారు. ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు మాత్రం ఎన్నో రాయితీలను కల్పిస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులకు మాత్రం ఒరిగిందేమీ లేదు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే భూములను తీసుకుంటున్నారు. సారవంతమైన సాగు భూములను కూడా పరిశ్రమల కోసం కట్టబెట్టడం సరైంది కాదు.

దరఖాస్తు చేసుకోగానే భూమిని కేటాయిస్తాం

- మధుసూదన్ రెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్

ఎంఎస్ఎంఈ పార్కులో ఎవరైనా పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోగానే భూమిని కేటాయించడం జరుగుతుంది. ఇక్కడ పార్కులో అన్ని మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నాం. పరిశ్రమలను పెట్టే వారికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం పొందేందుకు అవకాశం ఉంటుంది.

శిథిలమైన విద్యుత్ స్తంభాలు

-చేతికి అందేలా విద్యుత్ తీగలు -పొంచి ఉన్న ప్రమాదం
-ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల వల్ల ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ప్రాణ నష్టం జరగకముందే వేగంగా చర్యలు తీసుకోవాలని స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పి.వెంకటేశ్వర్లు, ఎ.వేణుధర రెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్ రమణ గౌడ్ కోరారు. బుధవారం స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధిబృందం ఈశ్వర్‌నగర్, భాస్కర్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించింది. 30,40 ఏళ్ల కిందట వేసిన విద్యుత్ ఇనుప స్తంభాలు కొన్ని శిథిలావస్థకు చేరి అప్పుడో ఇప్పుడో గాలికి కిందబడేలా ఉన్నాయన్నారు. ఇండ్లకు 2 అడుగుల దూరంలో..నేలకు 8-10 అడుగుల దూరంలో విద్యుత్ వైర్లు వేలాడుతూ.. ప్రమాదకరంగా తయారయ్యాయన్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వివరిస్తున్నారని విమర్శించారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు రోడ్లపై తిరిగేందుకు భయపడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎత్తయిన కొత్త విద్యుత్ స్తంభాలు వేసి ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యూనుస్, సివి వర్మ, ఎస్.అన్వర్, బాష, ఆర్.విజయ రాజు, ఎన్. రాబర్ట్, ఎంసి.తేజ, ఎం. శ్రీకాంత్,ఎం సి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను చూపుతున్న నాయకులు

80 శాతం సబ్సిడీతో డ్రోన్‌లు మంజూరు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో 1127 మంది రైతులకు రూ.2.42 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు కూడా మంజూరు చేస్తున్నామన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేసిన రైతులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను పెంచడంలో వ్యవసాయ యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వ్యవసాయంలో అభివృద్ధి, రైతులకు సాగు ఖర్చు తగ్గించడం, కార్మిక కొరతను తగ్గించడం వంటి అంశాల్లో యంత్ర పరికరాలు ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 2024 - 2025 ఆర్థిక సంవత్సరం లో సంబంధించి 314 గ్రామాల్లో 1127 మంది చిన్న, సన్న కారు రైతులకు రూ. 2.42 కోట్ల సబ్సిడీ మొత్తంతో వ్యవసాయ పరికరాలను అందచేసిందన్నారు.. బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటవేటర్స్, పవర్ వీడర్స్, బండ్ ఫార్మర్స్ తదితర పరికరాలను పంపిణీ చేశామన్నారు. వీటిని వ్యవసాయంలో సమర్థవంతంగా వినియోగించుకో వాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఆన్‌లైన్‌లో ఉండే పరికరాలే కాకుండా ఇంకా ఇతర పరికరాల అవసరం ఉంటే చెప్పాలని కలెక్టర్ రైతులతో చెప్పారు. అవసరం ఉంటే ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో 35 డ్రోన్‌ల ఏర్పాటు లక్ష్యంగా ఉందని, ఒకవేళ అంతకంటే ఎక్కువ మంది రైతులు ముందుకు వస్తే, వారితో గ్రూప్స్ ఏర్పాటు చేసి వారి నుండి దరఖాస్తులను తీసుకోవాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. డ్రోన్ స్ప్రేయర్లను రైతులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. డ్రోన్ స్ప్రేయర్ల ద్వారా రైతులకు చేకూరుతున్న లబ్ధి గురించి ఇతర రైతులలో కూడా అవగాహన కల్పించే విధంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. 2025- 26 సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 35 డ్రోన్లను లక్ష్యంగా నిర్ణయించగా 11 డ్రోన్లకు మంజూరు కాగా, దేవనకొండ మండలానికి చెందిన బిస్మిల్లా గ్రూపుకు డ్రోగో కంపెనీకి చెందిన డ్రోన్ ను జిల్లా కలెక్టర్ అందచేశారు. డ్రోన్ ధర రూ.9.8 లక్షలు కాగా 80శాతం రాయితీపై డ్రోన్‌ను అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారులు, డ్రోగో కంపెనీ జిఎం చాంద్ బాషా, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

-రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
-ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

తరచుగా మోటార్ బైక్ వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని గోనెగండ్ల పోలీసులు అరెస్టు చేశారని బుధవారం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.35 లక్షల విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుని వివరాలను వెల్లడించారు. ఆయన మాటల్లో.. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ప్రాంతాల్లో బైక్‌లు దొంగలిస్తున్నా రని ఫిర్యాదులు వచ్చాయి. గోనెగండ్ల పోలీసు స్టేషన్ కేసు నమోదు చేశారు. ఎమ్మిగనూరు డిఎస్‌పి ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో గోనెగండ్ల సిఐ ఒ.విజయ భాస్కర్ తన సిబ్బందితో బృందంగా ఏర్పడి నిఘా, గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు బుధవారం పెద్దమరివీడు గ్రామంలో ఊరి బయట ఉన్న సుంకులమ్మ ఆలయం వద్ద సంచరిస్తు న్నాడని అందిన విశ్వసినీయ సమాచారం మేరకు తెల్లవారుజామున 6 గంటలకు అదుపులోకి తీసుకొన్నారు. 30 మోటార్ బైకులను దొంగిలించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. 30 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, ఓర్వ కల్లు ప్రాంతాల్లో దొంగిలించినవిగా నిందితుడు అంగీకరించాడు. ఆ బైక్ చాసిస్ నెంబర్లను ఆధారంగా సంబంధించిన ఓనర్లకు బైక్‌లు అప్పగిస్తామన్నారు. మరో ఇద్దరు బైక్ నిందితులు ఉన్నట్లు తెలిసిందని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తాం. మరిన్ని బైక్‌లను కూడా రికవరి చేస్తాం. చోరీచేసిన బైక్‌లను జొన్నగిరి ప్రాంతాలలో పొలాల పనులు చేసుకునే రైతులకు రూ. 4 వేలు, రూ5 వేలకు ఇద్దరికి అమ్మివేశాడు. పోలీసుల తనిఖీల్లో దొంగలించిన వాహనాలు బయట పడ్డాయి.

నేరాల నియంత్రణకు గట్టినిఘా : నేరాల నియంత్రణకు జిల్లాలో గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. అందులో భాగంగా 28 బీట్స్‌ను ఈ - బీట్స్‌గా రూపొందించాం. గస్తీలు పెంచి పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మూడున్నర నెలల్లోనే దాదాపు 5 వేల సిసిటివి కెమెరాలను ప్రజల సహకారంతో ఏర్పాటు చేశాం. ఆ సిసి కెమెరాల సహాయంతో ఈ కేసును సులువుగా ఛేధించడానికి వీలయింది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలలో కూడా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్), ఎంపి నిధులు, మున్సిపల్ నిధులతో మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తాంఙ ఎక్కడైనా వాట్సాప్, టెలి గ్రాం గ్రూపులలో ఎపికె ఫైల్స్ వస్తే వాటిని క్లిక్ చేయకూడదు. ఒపెన్ చేయకూడదు. మీడియా వారు కూడా సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సహకరించాలి. ద్విచక్ర వాహనా ల దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన గోనెగండ్ల సిఐ ఒ.విజయ భాస్కర్, హెడ్ కానిస్టేబుళ్లు, ఎన్.తేజేశ్వర కుమార్, యు.దేవరాజు, కానిస్టేబుళ్ల వై.రాజు, కె.లక్ష్మీకాంత్, ఇ.వీరేష్ గౌడ్, ఎం.బ్రహ్మయ్య, జి. శ్రీనివాసులు, ఎస్.రమేష్‌ను నగదు రివార్డుతో అభినందించారు.

మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సచివాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు , ప్రభాకర్, గోపి

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ డిమాండ్ చేశారు. కర్నూలు మున్సిపల్ పరిధి 36 వ వార్డు పెద్దపాడు గ్రామ సచివాలయం ముందు పేదలందరికీ- ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం పెద్దపాడు గ్రామ కమిటీ కార్యదర్శి గోపి అధ్యక్షతన ధర్నాను నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు, నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని నిరుపేద మధ్యతరగతి ప్రజానీకానికి రెండు సెంట్లు స్థలం ఇచ్చి రూ.ఐదు లక్షల రుణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటాల ద్వారా పేదలందరికీ నివాసయోగ్యమైన కొట్టాలు వేయించాలని ప్రయత్నించగా అధికారులు హుటాహుటిన అక్కడికి వచ్చి మీరు జాబితా ఇవ్వండి మూడు నెలల్లో సమస్యలు పరిష్కరించి ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు ఆ ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్జీలు ఇచ్చిన వారందరికీ ఇళ్ల స్థలాలు చూపించి ఇల్లు నిర్మించుకోవడానికి లోను మంజూరు చేయాలని, లేకుంటే తిరిగి భూపోరాటం ద్వారా పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంచి కొట్టాలు వేయిస్తావని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి గోపినాథ్, వరలక్ష్మి, యేసు రాజు, మహేష్, కృష్ణ, చిరంజీవి, రమేష్, రవి, నారాయణ, రాజ్యలక్ష్మి, మంజుల నాగమ్మ, చంటమ్మ, సునీత, వరాలు చిట్టెమ్మ ప్రజలు పెద్ద పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన డీలర్లు

ప్రజాశక్తి-సి బెళగల్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటలక్ష్మిని మండలంలోని రేషన్ డీలర్లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు స్వీట్లు, పండ్లు అందించి, శాలువా వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలని అవకతవకలకు తావు ఇవ్వరాదని కోరారు. ఎవరైనా అధికారుల ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ డీలర్లకు హెచ్చరించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చిరంజీవి పార్కు దగ్గర నుంచి చిన్న పార్కు వరకు భిక్షాటన చేశారు. మున్సిపల్ ఇంజనీర్ కార్మికులకు జీతాలు పెంచాలని చేస్తున్న సమ్మె 43 రోజులకు చేరింది. ప్రజలకు , ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా 43 రోజులుగా కార్మికులు న్యాయం కోసం పోరాడుతున్నా కూటమి ప్రభుత్వం ఇంతవరకు స్పందించడం లేదని నాయకులు తెలిపారు. సమస్యలను ప్రజల దృష్టికి తీసుకొని పోయి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఇకనైనా వెంటనే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు గత ప్రభుత్వం మాకు అన్యాయం చేసింది 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో పురపాలక సంఘాల లో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే జీతం ఉన్నదని, వైసీపీ ప్రభుత్వం వచ్చి రూ.15000 ఉన్నదాన్ని రూ.21000, రూ. 18500 ఉన్నదాన్ని రూ.24500 పారిశుధ్య కార్మికులకు మాత్రమే పెంచి ఇంజనీర్ కార్మికులమైన మాకు పెంచకుండా అన్యాయం చేసిందన్నారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల జీత భత్యాల విషయం మీద వినతి పత్రం ఇవ్వడంతో పాటు ప్రజాప్రతినిధులతో సహా రాష్ట్ర పరిపాలన సాగించే ప్రభుత్వ అధికారులకు కూడా ఇచ్చామన్నారు. మా సమస్య ఎవరు పట్టించుకోనందున తిరిగి, విసిగి వేసారి సమ్మెకు పూనుకున్నామన్నారు.

చిరంజీవి పార్కువద్ద భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

-రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విద్యార్థి దశనుండే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు దృష్టి సారించాలని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. రాయలసీమ వర్సిటీలో జరుగుతున్న యోగాంధ్ర వర్క్‌షాపునకు బుధవారం ముఖ్యఅతిథిగా రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్యతో పాటు వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రోజువారిగా వ్యాయామం యోగా లాంటివి చేస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బిఆర్ విజయకుమార్ నాయుడు , వివేకానంద కేంద్ర ప్రముఖులు శివప్రసాద్ సిడిసి డీన్ సుందరానందపుచ్చా, రీసెర్చ్ డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి వర్క్ షాప్ కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో నిర్వహించిన మూడవ సెమిస్టర్ రెగ్యులర్ , సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వైస్ ఛాన్సలర్ వెంకట బస్వరావ్ బుధవారం విడుదల చేశారు. వర్సిటీ పరిధిలో జరుగుతున్న లా ఆరవ సెమిస్టర్ , 10వ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ డీబార్ అయ్యారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ఓపెన్ స్కూల్ పరిధిలో ఇంటర్ , టెన్త్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు జులై నెలాఖరు వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ ప్రవేశాల్లో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

త్వరలో 15వ ఆర్థిక సంఘం నిధులు

త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమయ్యాయని పంచాయతీ రాజ్ చాంబర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి తెలిపారు. బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను మెరుగుపరచాలని సదుద్దేశంతోనే యోగా సాధననెల రోజులపాటు నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. యోగా సాధన అనేది వయసుతో సంబంధం లేదని చిన్నపిల్లల నుండి పెద్ద వయసు వారు కూడా ప్రతి ఒక్కరు యోగా సాధన చేయొచ్చని తెలిపారు. యోగా సాధన చేయడం ద్వారా మానవ జీవితంలో ఆరోగ్యపరంగా సమూల మార్పులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాస్, కె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి డాక్టర్ జి రంగారెడ్డి, డాక్టర్ హేమంత్, డాక్టర్ సత్యనారాయణ, క్లస్టర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ సోమశేఖర్, మధు సుధాకర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్మెన్ డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

హాకీ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ఒలంపిక్ డే రన్ విజయవంతం చేయండి

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్ : ఈనెల 22న ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలులో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒలంపిక్ డే సందర్భంగా హాకీ, జూడో పోటీలు నిర్వహించారు. అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈపోటీలను డాక్టర్ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు కొత్తగా స్నేహితులు ఏర్పడుతారని తెలిపారు. ఈసంవత్సరం ఒలంపిక్ డే స్లోగన్ లెట్ అస్ మూవ్ (ముందుకు పోదాం) అని తెలియజేశారు. ఒంటరి తనం నుంచి బయట పడాలంటే క్రీడల్లో పాల్గొనాలన్నారు. హాకీ క్రీడకు ధ్యాన్‌చంద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకుని వచ్చారన్నారు. భారతదేశ జాతీయ క్రీడ అయిన హాకీ ని విద్యార్థులు ఎంచుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రామాంజనేయులు, సుధీర్, చిన్నసుంకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

మోటూరుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పత్రికా సంపాద కునిగా, సిద్ధాంత కర్తగా, గొప్ప వక్తగా, విప్లవో ద్యమానికి ఎనిలేని సేవలందించిన మోటూరు హనుమంతరావు నిరాడంబర జీవితాన్ని గడిపారని ప్రజాశక్తి కర్నూలు డెస్క్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య అన్నారు. ఆయన 24వ వర్దంతి సందర్భంగా కర్నూలు ఎడిషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అకౌంటెంట్ జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.చంద్రయ్య మాట్లాడుతూ మోటూరు రచనలో సూటిదనం, కరుకుదనం, గంభీరత, వాదనా పటిష్టత ఉట్టి పడతాయన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు పోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సబ్‌ఎడిటర్లు ఎం.అయ్యస్వామి, పి.మాసుం, స్టాఫ్‌రిపోర్టర్ ఎంయు.వినయకుమార్, డిజైనర్ రాంప్రసాద్, క్లర్క్ మాసుం, లు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బియ్యం మాయం వెనుక ఎవరున్నా వదలం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

రేషన్ బియ్యం మాయం చేసిన వారెవరైనా వదలబోమని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో తహశీల్దార్ రమేష్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఈనెల 13న రేషన్ బియ్యం గోడౌన్‌పై సివిల్ సప్లరు కమిషన్ డైరెక్టర్ మహేష్ నాయుడు ఆకస్మికంగా దాడులు చేశారన్నారు. 1500 నుంచి 1800 సంచులు మాయమైనట్లు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోందని తెలిపారు. రేషన్ బియ్యం మాయం వెనుక ఎవరున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. అలాగే ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యం సేకరించే వారిపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. బియ్యాన్ని రేషన్ డీలర్లు తప్పుదారి పట్టిస్తే విచారణ చేపట్టి నిజమని నిరూపణ అయితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. రేషన్ బియ్యం మాయం వెనుక రెవెన్యూ అధికారులున్నా, పోలీసు అధికారులున్నా విచారణ చేపట్టి నిజ నిరూపణ అయితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ తహశీల్దార్ బాబు, విఆర్ఒ రాజశేఖర్ గౌడ్ ఉన్నారు.

2029 ఎన్నికల్లో వైసిపికి జీరో సీట్లు

- ఎమ్మెల్యే డాక్టర్ బివి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉనికి కోసం ప్రజలను మభ్యపెట్టి విధ్వంసం చేయాలని వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు 2029 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని, తల్లికి వందనం అమలుతో వైసిపి నేతలకు నిద్ర పట్టడం లేదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రేఖాగౌడ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగన్ హయాంలో అమ్మ ఒడి కేవలం ఒక బిడ్డకు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 67 లక్షల మంది తల్లుల ఖాతాలో రూ.13 వేలు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసిపి పాలనలో విద్యా వ్యవస్థ నాశనం చేశారని మండిపడ్డారు. పాఠశాలల అభివృద్ధికి రూ.2 వేల చొప్పున కేటాయిస్తే.. వైసిపి తప్పుడు ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టౌన్ బ్యాంకు అధ్యక్షులు ప్రతాప్ ఉరుకుందు శెట్టి, వైస్ చైర్మన్ నర్సప్ప, డైరెక్టర్లు గ్రంధి గిరి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డిఎల్ కంఠం గురు రాఘవేంద్రరావు, 30వ వార్డు నాయకులు సి.రంగయ్య, సి.విజయలక్ష్మి, కటారి రాజేంద్ర, బేతాళ బడే సాబ్ పాల్గొన్నారు.

కనికరం చూపడం లేదు

- 15వ రోజూ నిరసన దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

సంఘీభావం తెలుపుతున్న దేవిశెట్టి ప్రకాష్

సమాన పనికి సమాన వేతనమివ్వాలని కోరుతున్నా ప్రభుత్వం కనికరం చూపడం లేదని మున్సిపల్ కాంట్రాక్టు ఇంజినీరింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరింది. పట్టణంలోని భీమాస్ కూడలిలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ నాయకులు పీరా, సోమన్న, అహ్మద్, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడారు. రాత్రి, పగలు తేడా లేకుండా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, ప్రభుత్వం గుర్తించడం లేదని వాపోయారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్మికులు కర్రెప్ప, జెసిబి తిమ్మప్ప, ఐసి వీరేష్, దేవేంద్ర, రామాంజనేయులు, మోయిన్ వలీ, శరత్, శంకర్, దాదా ఖలందర్, నూర్, పెద్ద శివ, ఆంజనేయులు, రఘు ఉన్నారు.

తనిఖీ అధికారులకే బురిడి..!

- నర్సింగ్ కళాశాల నిర్వాహకుల మాయాజాలం

ప్రజాశక్తి - ఆదోని

ఆ కళాశాలకు అనుమతులు ఎక్కడ ఉన్నాయో తెలియదు.. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నర్సింగ్ కళాశాలకు ఆకస్మిక తనిఖీలకు వస్తున్నారని తెలిసిన మరుక్షణమే అక్కడ ఉన్న వాతావరణాన్నంత పక్కన ఉన్న మరోచోటుకు మార్చేశారు. తనిఖీకి వచ్చిన వైద్యాధికారులను బురిడి కొట్టించారు. అప్పటికప్పుడు కళాశాల బిల్డింగ్.. అప్పటికప్పుడు నర్సింగ్ స్కూల్ నేమ్ బోర్డ్.. స్టిక్కర్.. అప్పటికప్పుడు ఓ బస్సు.. అప్పటికప్పుడే ఇంట్లో ఉన్న నర్సింగ్ విద్యార్థినులను తీసుకొచ్చి ఇవన్నీ చేసి నడిపించేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారులకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా అవి తనిఖీ చేశామంటూ నర్సింగ్ స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన వాటి ముందు ఫొటోలు తీసుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో టివిఎస్ షోరూం ఎదురుగా, వెంకటేశ్వర జూనియర్ కళాశాల పక్కన ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ (జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ కళాశాల)ను గత మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ అంటూ బోర్డు పెట్టేశారు. అందులో ఇంటర్మీడియట్ పూర్తయిన వారికి జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ (జిఎన్ఎం) మూడున్నర ఏళ్ల కోర్సుకు ప్రవేశాలు జరుపుకున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లేకున్నా జిఎన్ఎం తరగతులు నిర్వహిస్తున్నారు. కర్నూలు కళాశాలకున్న అనుమతులతో సర్టిఫికెట్లను వారికి అందజేస్తున్నట్లు తెలిసింది. ఆదోనిలో ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఉందని ఇటీవల అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. విజయవాడ వైద్య, ఆరోగ్యశాఖ డిఎంఇ రిజిస్టర్ కార్యాలయం నుంచి తనిఖీల కోసం బుధవారం అధికారులు వచ్చారు. ముందుగానే ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఆఫ్ కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే అదే ఏరియాలో వెనుక రోడ్డులో ఉన్న విశ్వ నారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాల భవనాన్ని చూపించే ప్రయత్నం చేశారు. విశ్వ నారాయణ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సెలవు ప్రకటించేసి ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు గంటపాటు భవనం అప్పజెప్పారు. 'శంకర్ దాదా ఎంబిబిఎస్' సినిమాను తలపించేలా ఉదయమే వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీకి వచ్చేలోపు అక్కడున్న వాతావరణాన్నంత మార్చేశారు. విశ్వ నారాయణ జూనియర్ ఒకేషనల్ కళాశాల బోర్డు స్థానంలో ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్టిక్కర్‌ను అతికించారు. అప్పటికప్పుడే గేటుకు ఓ బోర్డును తగిలించారు. మరో విశేషమేమంటే విశ్వ నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన బస్సును సైతం ముందు భాగంలో ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ అంటూ స్టికర్ వేశారు. ఫ్యాకల్టీ ఎవరు లేకున్నా.. కర్నూలు నుంచి వారిని కార్లలో రప్పించి తెల్లకోటు (యాప్రాన్) ధరింపజేసి వీరే ఫ్యాకల్టీ అని చూపించారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు ల్యాబ్‌లు లేకున్నా గంటపాటు కళాశాలకు చెందిన ల్యాబ్‌లు ఉన్నాయంటూ.. సెట్ చేసేశారు. మీడియా ప్రతినిధులకు అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలియడంతో అక్కడికి వెళ్లారు. మీడియా ప్రతినిధులను చూసి తనిఖీలకు వస్తున్న అధికారులను ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం అలా కారులోనే ఆదోని అంత తిప్పారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించేందుకు అధికారులు రావడం లేదంటూ కళాశాలలో ఉన్న విద్యార్థులను మరో చోటికి పంపారు. సిబ్బంది అంతా బయటికి వెళ్లారు. ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ బోర్డును తిప్పేశారు. అక్కడి నుంచి మీడియా ప్రతినిధులు వెళ్లిన వెంటనే అరగంటలోనే తనిఖీకి వచ్చిన అధికారులను మరోమారు సెట్ చేసి లేనివి ఉన్నట్లు వారికి కళాశాల యాజమాన్యం చూపించారని తెలిసింది. తనిఖీకొచ్చిన అధికారులు ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం చెప్పినట్లు నడుచుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది.

వెనుదిరుగుతున్న సిబ్బంది

మంత్రాలయంలో మాట్లాడుతున్న శ్రీమఠం పీఠాధిపతులు

చిప్పగిరిలో యోగా చేస్తున్న సిబ్బంది, డీలర్లు

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

- శ్రీమఠం పీఠాధిపతులు, ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యోగా ఏళ్ల నాటి ప్రక్రియ అని, మానవ జీవనంలో ఒత్తిడి తగ్గేందుకు యోగాసనాలు ఉపయోగపడతాయని తెలిపారు. యోగా ద్వారా శరీరాన్ని, శ్వాసను, అవయవాలను, మనస్సును ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని చెప్పారు. ప్రజలందరూ యోగా కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మఠం మేనేజర్ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, సెట్కూరు సిఇఒ వేణుగోపాల్, పర్యాటకశాఖ అధికారి విజయ, డిపిఒ భాస్కర్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ కార్యదర్శి, సిబ్బంది, రేషన్ దుకాణాల డీలర్లు యోగాసనం చేసి చూపించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, మండల సర్వేయర్ నారాయణ, ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీల్లో తహశీల్దార్ పి.రాజేశ్వరి, హౌసింగ్ డిఇ ఎస్‌వి.ప్రసాద్ బుధవారం పర్యటించారు. ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన 3 లక్షల గృహ ప్రవేశాల్లో భాగంగా గోనెగండ్లలోని భారత్ గ్యాస్, కెజిబివి హౌసింగ్ కాలనీల్లో పర్యటించి పిఎంఎవై కింద జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. అలాగే ఆయా కాలనీల్లో రోడ్లు, విద్యుత్ లైన్ల ఏర్పాట్లను పరిశీలించారు.

పర్యటిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చాలావరకు ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్ వరకు జరిగి నిలిచి పోయాయని తెలిపారు. లబ్ధిదారులందరూ తిరిగి వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. లేకపోతే పట్టా, గృహ మంజూరు రద్దు చేసి, అవసరం ఉన్న లబ్ధిదారులకు మంజూరు చేస్తామని తెలిపారు. హౌసింగ్ ఎఇ షేక్షావలీ పాల్గొన్నారు.

'యోగా'ను విజయవంతం చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిడిఒ మణిమంజరి, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ కోరారు. బుధవారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులతో పాటు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, అలాగే మిగతా గ్రామాలకు సంబంధించిన వారు నిర్దేశించిన ప్రాంతాల్లో పాల్గొనాలని తెలిపారు. ఒకరోజు ముందుగానే అక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసుకొని సమీక్షించుకోవాలన్నారు.

ఫీజు బోర్డులు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ప్రయివేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున కోరారు. బుధవారం ఎంఇఒ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠ్యపుస్తకాలను కూడా అధిక ధరలకు విక్రయిస్తూ.. ప్రత్యేక ఫీజులు కూడా వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అనుగుణంగా వసతులు కూడా ఏర్పాటు చేయించాలని, పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలు కూడా సరయిన ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్నారని చెప్పారు. చిన్న, చిన్న వాహనాల్లో విద్యార్థులను ఇబ్బంది పడేవిదంగా తీసుకొస్తున్నారని తెలిపారు. ఇలా చిన్న వాహనాల్లో కాకుండా విద్యార్థులు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని, మండలంలోని ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సతీష్ పాల్గొన్నారు.

'డ్రైయినేజీ ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - కోసిగి

రోడ్డు మధ్యలో నీరు నిల్వ ఉండకుండా డ్రైయినేజీ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో దొడ్డి గ్రామంలో కాలనీ వాసులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దొడ్డి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర రోడ్డు మధ్యలో గుంతలు ఉండడంతో వర్షపు నీరు చేరి విద్యార్థులు, గ్రామస్తులు బురద నీరులోనే నడుచుకుంటూ వెళ్ళాల్సి ఉందని తెలిపారు. విద్యార్థులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి దొడ్డి గ్రామంలో పాఠశాల దగ్గర రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలను పూడ్చి నీరు నిల్వ ఉండకుండా డ్రైయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్తులు తాయన్న, హనుమంతు, నరసయ్య, చిటికెల నరసింహులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

కొట్టుకుపోయిన వంతెన

- **నదీచాగి, హాల్వికి రాకపోకలు బంద్**
- **విద్యార్థులకు, రైతులకు ఇబ్బందులు**

ప్రజాశక్తి - కౌతాళం

ఇటీవల కురిసిన భారీ వర్షానికి కుమ్మాలనూరు క్యాంపు, హాల్వి మధ్యలో ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. మండలంలోని నదీచాగి, హాల్వి గ్రామాల మధ్య రాకపోకలు బంద్ కావడంతో రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలల నుంచి ఈ సమస్యను ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కొట్టుకుపోయిన వెంతనకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. బస్సులు రాక, వ్యవసాయ ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు కూడా అవకాశం లేకపోవడంతో రైతులు, విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. తుంగభద్ర నదీతీరంలో ఉన్న కొన్ని గ్రామాలకు ఈ రోడ్డు ఎంతో అవసరం. వర్షాలు కురవడంతో రైతులకు విత్తనాలు, ఎరువులు, పొలాల పనులకు వ్యవసాయ కూలీలు హాల్వి, కుమ్మాలనూరు క్యాంపు-1, 2, కుమ్మాలనూరు, నదీచాగి, మేళిగనూర్ గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడం, పాఠశాలలు తెరచుకోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కొంతమంది ప్రయాణికులు ప్రమాదమని తెలిసినా వంకలో దిగి అనేక ఇబ్బందులు పడి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాల్లో అనారోగ్యానికి గురయితే హాల్వి గ్రామంలో ఉన్న ఎంబిబిఎస్ డాక్టర్ వద్దకు ప్రజలు వస్తుంటారు. ఆర్అండ్‌బి రోడ్డుపై ఉన్న వంతెన కొట్టుకుపోవడంతో ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి నూతన వెంతన నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొట్టుకుపోయిన వంతెన

ఎంఇఒ ఏకపక్ష నిర్ణయంపై ప్రతిఘటన

- పాఠశాల విలీనంపై తల్లుల నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ప్రధాన ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేస్తూ ఎంఇఒ మొయినుద్దీన్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని విద్యార్థుల తల్లులు ప్రతిఘటించారు. బుధవారం రామచంద్ర నగర్ కాలనీలో ఉన్న పాఠశాలకు విద్యార్థుల తల్లులు చేరుకొని రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మేకల వెంకటేష్ మాట్లాడారు. విద్యా కమిటీ ఆమోదం లేకుండా విద్యార్థులను వేరే పాఠశాలకు ఎలా పంపుతారని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం సేకరించకుండా, ప్రజాప్రతినిధులకు చెప్పకుండా నిరక్షరాస్యత కలిగిన ఛైర్మన్ చిట్టెమ్మతో వేలిముద్ర వేయించి జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. సంత మార్కెట్‌లో ఉన్న పాఠశాల పురాతనమైందని, వర్షం వస్తే లోపలికి నీరు చేరుతాయని తెలిపారు. ఎప్పుడూ రద్దీగా ఉండే రాఘవేంద్ర సర్కిల్ మీదుగా పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి అని, ఇటీవల ఒక విద్యార్థికి ద్విచక్ర వాహనం ఢీకొని కాలికి గాయమయిందని చెప్పారు. పాఠశాల సమీపంలో తుంగభద్ర నది ఉందని, నది వైపు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. స్పందించిన ఎంఇఒ మాట్లాడుతూ... తల్లిదండ్రుల అభిప్రాయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని, జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. ఎంఇఒ- 2, రాఘన్న, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఇంద్రజ, జిల్లా ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ మద్రి నరసింహ, టిడిపి నాయకులు ఆర్‌కె.రాఘవేంద్ర, కె.నరసింహ, మద్రి శివ, విద్యార్థుల తల్లులు అంబిక, పరిమళ, గౌరి, లక్ష్మి, హేమలత, సుకన్య, శాంతమ్మ, ప్రశాంతి పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న విద్యార్థుల తల్లులు

విఆర్ఒ కోసం పడిగాపులు

ప్రజాశక్తి-దేవనకొండ

మండలంలో తెర్నేకల్ విఆర్ఒ కోసం ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తహశీల్దార్ చొరవ తీసుకుని విఆర్ఒను సచివాలయానికి పంపించాలని సిపిఎం నాయకులు గాజుల శ్రీనివాసులు, రవీంద్ర కోరారు. బుధవారం తెర్నేకల్ గ్రామ సచివాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత పది రోజులుగా రెవెన్యూ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామస్తులు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. విఆర్ఒ అందుబాటులోకి రావడం లేదని, ఫోన్ చేస్తే 'ఇప్పుడు వస్తున్నాను.. అప్పుడు వస్తున్నాను' అంటూ చెబుతారని అన్నారు. వ్యవసాయ సీజన్, పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం, రెవెన్యూ సేవల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా విఆర్ఒ అందుబాటులోకి రావడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేశామని అన్నారు. సచివాలయ కార్యదర్శిని కూడా విఆర్ఒ గురించి అడగగా 'విఆర్ఒ వస్తున్నాడ'ని చెబుతున్నారని, వీఆర్వో అందుబాటులోకి రావడం లేదని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిపై ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాల నిమిత్తం అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని, చాలామంది సచివాలయాలకు ఆలస్యంగా వస్తున్నారని చెప్పారు. మండల కేంద్రానికే పరిమితం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు అర్థం లేకుండా పోతోందని వాపోయారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ప్రజలకు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని కోరారు.


ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

బదిలీ ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి - హొళగుంద

బదిలీలపై వెళ్లిన ఎంఇఒ-1 టి.సత్యనారాయణను ఎస్‌టియు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. అలాగే నూతనంగా వచ్చిన ఎంఇఒ-1 డి.సుధారాణికి ఆహ్వానం పలికారు. ఉపాధ్యాయులు ఎస్.పోతరాజు, జి.దొడ్డ బసప్ప, లాలు స్వామి, ఎం.మోస, బిటి.ఖలందర్, లింగమయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు సిద్ధప్ప పాల్గొన్నారు.

ఎంఇఒను సన్మానిస్తున్న నాయకులు

పని గంటలు పెంచడం తగదు

- కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పని గంటలు పెంచే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. బుధవారం కార్యాలయం ముందు సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిప్పన్న, ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు వెంకన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎంకప్ప మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన పని గంటల పెంపునకు వ్యతిరేకంగా ఈనెల 20న నిరసనలో ఉద్యోగ, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల పని గంటల పెంపు నిర్ణయాన్ని సమర్థించడం తగదన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 20న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని ఉద్యోగ, కార్మికులను కోరారు. ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి 10 గంటలు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసి, జారీ చేసిన జిఒపై ప్రభుత్వం పునరాలోచించాలని తెలిపారు. రోజుకు 8 గంటల పని, 8 గంటల కుటుంబ సేవలు, 8 గంటల నిద్ర అనేది ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన విజయమని చెప్పారు. బడా కార్పొరేట్ సేవల్లో తనమునకలైన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పనివేళలు 10 గంటలకు పెంచడం తగదన్నారు. మహిళలు కూడా రాత్రి సమయంలో పని చేయవచ్చని నిర్ణయాలు చేయడమంటే కార్మికులను బానిసలుగా చేయడమేనని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జిఒ వల్ల కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ అభద్రతాభావం, పని ప్రదేశాల్లో అభద్రతాభావం పెరిగిపోతుందని తెలిపారు. ధర్నా, నిరసనలను జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

ఫలించిన సమతా సైనిక్ దళ్ పోరాటం

- ఆదోని ఎస్సీ హాస్టల్‌కు భవనం కేటాయించిన ప్రభుత్వం

- 'కూటమి'కి కృతజ్ఞతలు

- సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆదోని నియోజకవర్గ ఎస్సీ హాస్టల్ సమస్యలపై సమతా సైనిక్ దళ్ గతంలో చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రంగయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ... సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితిని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఆదోని పట్టణానికి దూరంగా ఖబరస్థాన్‌లో ఏర్పాటు చేసిన ఎస్సీ హాస్టల్ పాఠశాలలు, కళాశాలలకు దూరంగా ఉండడం, సమయానికి కళాశాలకు హాజరు కాలేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడి ప్రమాదానికి గురయిన సంఘటనలూ ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితి చూసి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడి పరిస్థితిని వివరించి త్వరలో పరిష్కారం చూపాలని కోరినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే హాస్టల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆదోని సెంటర్‌లో సకల సౌకర్యాలతో భవనం నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హాస్టల్‌కు వెళ్లి సౌకర్యాలను పరిశీలించి వార్డెన్లతో మాట్లాడారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా, భోజనం మెనూ ప్రకారం ఉండేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పార్థసారథికి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పోరాటం చేసిన లక్ష్మణ్, జాఫర్, రోషన్, షేకన్న, అభినందనలు తెలిపారు. రాయలసీమ నాయకులు పరమేష్, గూడూరు నల్లన్న, గోవిందు, ముని పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రంగయ్య

వ్యవసాయంపై 'కూటమి' చిన్నచూపు

- వైసిపి నాయకులు విరుపాక్షి రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

వ్యవసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైసిపి నాయకులు విమర్శించారు. బుధవారం వైసిపి మండల అధ్యక్షులు జె.శివారెడ్డి గౌడ్ నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి మాట్లాడారు. వైసిపి హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 10,641 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు, విత్తనాలు, రైతు రిజిస్టర్ల ఆధారంగా అవసరమైన సేవలు, నిపుణుల సలహాలు, మార్కెట్ ధరల సమాచారం వంటి అన్ని వ్యవసాయ సంబంధిత సేవలను అందించినట్లు తెలిపారు. రైతులకు తొలిసారిగా సురక్షితమైన వ్యవసాయ వాతావరణం కల్పించామని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను సగానికి పైగా నిర్వీర్యం చేసి, సేవల సరఫరా నిలిపేసిన దుస్థితి ఉందని విమర్శించారు. గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉన్న సేవలను మళ్లీ మండల కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేశారని మండిపడ్డారు. కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం కౌలు రైతుల హక్కులను గుర్తించి, వారికి డిజిటల్ విధానంలో గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ ప్రక్రియను నిలిపివేసి, కౌలు రైతులను అధికారికంగా అనర్హులుగా మార్చేస్తోందని విమర్శించారు. ఇది వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే నిర్ణయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు నష్టపరిహారం, రైతుబంధు తరహాలో భరోసా నిధులు, రుణమాఫీ వంటి అంశాల్లో ప్రస్తుత ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రాయితీ ధరలకు విత్తనాలు, ఎరువులు అందజేయాలని, రైతు భరోసా కేంద్రాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పునర్వైభవం రావాలంటే మళ్లీ వైసిపి పాలన రావాలని తెలిపారు. రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్.లక్ష్మీకాంత్ రెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షులు చాంద్ బాష, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు కెఆర్.రామకోటేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకట్రామి రెడ్డి, గురజాల జాన్, పల్లె శంకర్ రెడ్డి, శివన్న, నరసరాజు, కోతి ఈరన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి రెడ్డి

IN THE COURT OF THE CIVIL JUDGE:: ADONI (SENIOR DIVISION)
I.P. No.18/2023
Between :
Kummari Adi @ K. Adi Narayana
.... Petitioner
-V/s-
1.Kosigi Anjinaiah & 15 others
... Respondent
GENERAL NOTICE
Whereas the above name petitioner filed petitioner U/Sec x(2) R/w13 of provincial insolvency act to declare the petitioner as insolvent. Hence any body wants any objections with regard to the above petition are hereby appear before this court on 19.06.2025 at 10:30 AM and file objections if any otherwise the petition will be decided on merits.
(By Court Order)
K.SUDHAKAR RAO,
Advocate,
Adoni. Mobile : 9493697866